క్లుప్తంగా

బోరు పంపునకు మరమ్మతులు



కంచికచర్ల : మండలంలోని గండేపల్లి రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి కీసర మున్నేటిపై ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ బుధవారం బోరు మరమ్మతుపనులు చేపట్టారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో డ్రైనేజీల్లో మురుగునీరు పారుదల కోసం కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జే రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు గోడ నిర్మించరూ...



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని సుబ్బాయిగూడెం నుంచి కొళ్లికూళ్ల వెళ్లే రహదారిలో వాగుపై నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గతేడాది వచ్చిన వరద నీటికి కల్వర్టు గోడ ఓవైపు పూర్తిగా కొట్టుకు పోయింది. రోడ్డు పక్కన మార్జిన్ మొత్తం కూలిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పక్కకు వాహనాలు వెళ్తే వాగులో పడి పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఆర్అండ్బి అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రూ.26వేలు ఆర్థికసాయం



నందిగామ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ద ఆర్యవైశ్యుడికి పలువురు ఆర్యవైశ్యులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. పట్టణంలోని డీవీఆర్ కాలనీకి చెందిన ఎ.ఓంబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘ నాయకుడు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు కలిసి అతని కుటుంబానికి రూ.26వేలను ఆర్థికసాయంగా అందించారు. దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు డి.నాగేశ్వరరావు, కె.నాగప్రభాకర్‌రావు, నాగేశ్వరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం ఇక్కట్లు



జగ్గయ్యపేట: వంటగ్యాస్ వినియోగదారులంతా తమ కనెక్షన్‌కు సంబంధించిన వివరాలను ఈకేవైసీ చేయించుకునేందుకు ఆయా గ్యాస్ ఏజెన్సీల కార్యాలయాల వద్ద బుధవారం బారులు తీరారు. ఉదయం ఏడు గంటల నుంచి క్యూలైన్‌లో నిలబడినప్పటికీ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు టెంటు, మంచినీటి సదుపాయం కూడా కల్పించలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇవ్వగా, తాజాగా గ్యాస్ కనెక్షన్‌దారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గ్యాస్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తుండటంతో ఉచిత సిలిండర్ల పంపిణీ కోసమే ఈకేవైసీ చేయించుకోమంటున్నారని ఉద్దేశంతో వినియోగదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్నారు.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19న తిరువూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. 20న కాణిపాకం చేరుకుని దర్శనానంతరం శ్రీపుర మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అయిన అనంతరం 21వ తేదీ కంచి, తిరుత్తణి మీదుగా శ్రీకాళహస్తి చేరుతుందని చెప్పారు. కాళహస్తీశ్వరస్వామి దర్శనం అనంతరం 22వ తేదీ రాత్రి తిరువూరు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.2,800 రానుపోను టికెట్ ధర నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ సదుపాయం కల్పించామన్నారు. వివరాలకు 98856 61835 నంబరులో సంప్రదించాలని కోరారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్



పేట పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, మున్సిపల్, పంచాయతీ కార్మికులు



నందిగామలోని గాంధీసెంటర్‌లో ధర్నాచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. డిమాండ్స్‌డేను పురస్కరించుకుని పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశావర్కర్లు, పంచాయతీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీల నిర్వాహకులు, మున్సిపల్ వర్కర్లు పాల్గొని లేబర్ కోడ్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ స్కీమును అమలు చేయాలని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, స్కీము వర్కర్లకు ప్రత్యేక గుర్తింపు నివ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు ఎస్.రామనాథం, గౌసమియా, బాలు, ఆశావర్కర్లు ఉమా, అంజమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, మదార్‌బీ, రాజ్యలక్ష్మి, మున్సిపల్ వర్కర్లు ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ ధర్నా

నందిగామ: ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనంగా రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త డిమాండ్లలో భాగంగా నందిగామ పట్టణంలోని గాంధీసెంటర్‌లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.

మున్సిపల్ కార్మికుల ర్యాలీ

నందిగామ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నందిగామ మున్సిపల్ కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాల్సి ఉండగా నందిగామలో అధికారులు మాత్రం పదోతేదీ నాటికి కూడా జీతాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు మూడు నెలల బకాయిలు కూడా ఇవ్వాల్సి ఉందన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు నలికేటి నరేష్, మాణిక్యం, ప్రసాద్, రాజారావు, అశోక్, బేబీ, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి..

జుజ్జూరు(వీరులపాడు): ఆశావర్కర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులపై ఇకనైనా రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాజకీయ వేధింపులు తట్టుకోలేక పలువురు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాజకీయంగా వేధింపులకు పాల్పడటం తగదని హితవు పలికారు. కార్మికులకు కనీస వేతనంగా ప్రభుత్వం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు తహశీల్దార్ రాజకిషోర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మి, అరుణ, రాణి, సుబ్బలక్ష్మి, వాసవి, సరిత పాల్గొన్నారు.



నందిగామలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నేతలు



తహసీల్దార్ రాజకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

'అల్ట్రాటెక్' బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

బూదవాడ(జగ్గయ్యపేట): మండలంలోని బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఈ నెల ఏడో తేదీన జరిగిన రియాక్టర్ పేలుడు ప్రమాదంలో మృతిచెందిన, తీవ్రంగా గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం ఆదుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. బూదవాడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. కార్మికుడు బాణావత్ స్వామి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం శంకర్‌నాయక్ మాట్లాడుతూ..మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతోపాటు రూ.30 లక్షల పరిహారం అందించి వారి కుటుంబాలకు యాజమాన్యం తోడుగా ఉండాలన్నారు. మృతుని కుటుంబాలలో ఒకరికి కంపెనీలో రెగ్యులర్ ఉద్యోగంతో పాటు పిల్లల చదువు ఖర్చులు భరించాలని, ప్రభుత్వం కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని బాధితులకు ఇంటి స్థలాలు, వ్యవసాయ భూమిని కేటాయించాలన్నారు. అనంతరం యాజమాన్యం తరఫున రూ.50 లక్షల నష్టపరిహారం చెక్కును మృతుడు స్వామి భార్య శైలజకు అధికారులతో కలిసి అందజేశారు. నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు, డ్వామా పీడీ మాధవీలత, నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్, తహసీల్దార్ శేషగిరి, చిల్లకల్లు, వత్సవాయి ఎస్ఐలు సతీష్, అభిమన్యు, వైఎస్సార్ సీపీ నాయకులు బాల్యానాయక్, గడ్డం శ్రీను, భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న శంకర్‌నాయక్, ఆర్డీవో రవీంద్రరావు

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హర్షసాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

లోక కళ్యాణార్థం హోమాలు



జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న యజ్ఞదత్తాత్రేయస్వామి వారి దేవస్థానంలో లోకకళ్యాణార్థం బుధవారం హోమం నిర్వహించారు. యజ్ఞదత్తాత్రేయ స్వామివారి ఆలయం నుంచి యాగశాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లోక కళ్యాణం కోసం ఈనెల 15వతేదీ వరకు నిర్వహించే నిర్వహిస్తున్న హోమాల్లో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.

రెండేళ్ల బిడ్డ సహా వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రెండేళ్ల చిన్నారితో సహా వివాహిత అదృశ్యం కావడంతో భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీకి చెందిన పందిరి సురేష్, బుజ్జి భార్యాభర్తలు, వీరికి ఇద్దరు సంతానం. సురేష్ ఐస్‌క్రీమ్ అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 8వ తేదీన బుజ్జి తన చిన్న కుమారుడైన సాయికృష్ణను తీసుకుని గుంటూరు సమీపంలోని కాకానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాలనీకి చెందిన నాగసాయి అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ సురేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు సూచించారు. పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పట్టణంలోని వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా స్థానిక సీతారామపురంలోని వెంకటగిరి గుట్టపై ఉన్న వాటర్‌ట్యాంకు, చెరువుబజారులో ఉన్న వాటర్ ట్యాంకులను మున్సిపల్ పారిశుద్ధ్య బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ధనంబోడు కాలనీలో అన్ని వీధుల్లో ఫాగింగ్ చేశారు.



మంచినీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా ఉద్యోగావకాశం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి పీజీలో కంప్యూటర్ సైన్స్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12లోగా కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.14,500 వేతనం ఇస్తామని చెప్పారు.

బస్‌షెల్టర్ ప్రారంభం

కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచిలో నిర్మించిన బస్‌షెల్టర్‌తోపాటు గ్రామ టీడీపీ కార్యాలయాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)తో కలిసి బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా కొణకంచిలో ముస్లింల కోసం చేపడుతున్న కమ్యూనిటీహాల్ భవనానికి వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, సర్పంచి గోనెల దేవి, మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, గ్రామ నాయకులు కాకుమాను అశోక్, కాసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం నందిగామకు వచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో ఆయన పలు అంశాలపై చర్చించారు.



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

పశుసంరక్షణకు పెద్దపీట

పెనుగంచిప్రోలు: ఆపత్కాల సమయంలో మనుషులను ఆదుకునేందుకు 108అంబులెన్స్ వాహనం సేవలందిస్తోంది. అత్యవసర సమయంలో ఫోన్‌చేసిన వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతుండటంతో అపర సంజీవనిగా పేరు గాంచింది. ఇలాంటి సేవలే పశువులకు కూడా అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సంచార పశువైద్య వాహనం ఏర్పాటు చేసింది. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే ఇందులో వివిధ మందులు, వైద్య సిబ్బందితో కూడిన ఇంటి వద్దకే వచ్చి పశువులకు వైద్యసేవలందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే అదే వాహనంలో తరలించి చికిత్స అందించి అనంతరం ఇంటి వద్దకు తెచ్చి వదిలేస్తారు. పెనుగంచిప్రోలులోని రైతు రావూరి సైదులుకు చెందిన ఎద్దుకు కొద్దిరోజులుగా కాలు వాపుతో నడవలేనిస్థితిలో ఉండటంతో సదరు రైతు బుధవారం 1962 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి విషయం చెప్పారు. వెంటనే పశువైద్య సిబ్బంది సంచార పశువైద్యశాల వాహనంలో వచ్చి ఎద్దుకు చికిత్స చేసి మందులు అందజేశారు. ఈ సంచార పశువైద్యశాల వాహనసేవలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని పశుపోషకులు చెబుతున్నారు.



క్రిమినల్ కేసు నమోదుకు వినతి

జగ్గయ్యపేట అర్బన్: బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం దుర్ఘటనకు సంబంధించి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాసరావు కోరారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకరనాయక్ బుధవారం జగ్గయ్యపేటకు రాగా, ఆయనను కలిసి ఈ మేరకు ఓ వినతిపత్రం అందజేశారు. అల్ట్రాటెక్ ప్రమాదఘటనలో మృతిచెందినవారి కుటుంబాలకు ప్రభుత్వం కూడా పరిహారం ఇవ్వాలన్నారు. కార్మికులపై విచక్షణారహితం లాఠీచార్జి చేసిన పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని శంకర్‌నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యులు శంకరనాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై తాను విచారించి, బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించినవారిలో సీఐటీయూ నాయకులు రామనాథం, గౌసమియా, బాలు తదితరులు పాల్గొన్నారు.



శంకరనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి

కాచవరం(ఇబ్రహీంపట్నం): క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి అన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో పాస్టర్ మోగులూరి ఎలీషా సమకూర్చిన రూ.20 వేలు విలువైన నోట్‌బుక్స్, పెన్నులు బుధవారం విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థులు అన్ని అంశాలపై పట్టుసాధించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాఠశాలలో కల్పించిన ఇర్ఫాన్ పాషాను అభినందించారు. నైతిక విలువలతో కూడిన విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని దాత ఎలీషా పేర్కొన్నారు. పాస్టర్ ఎలీషా ఇప్పటి వరకు రూ.70 వేలు విలువైన వస్తువులు పాఠశాలకు సమకూర్చారని హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా కొనియాడారు. ఎంఈఓ పుష్పలత, హెచ్ఎం నాగమల్లేశ్వరి, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెట్టంత ప్రమాదం



నవాబుపేటలో రోడ్డు పక్కన ఎండిన చెట్లు

- రోడ్ల వెంబడి ప్రమాదభరితంగా ఎండిన చెట్లు
- భయాందోళనలో వాహనచోదకులు

నవాబుపేట(పెనుగంచిప్రోలు):మండలంలోని నవాబుపేట వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా వందల ఏళ్లనాటి వృక్షాలు జీవం కోల్పోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ చెట్లు ప్రధాన రహదారిపైకి విస్తరించి ఉండటంతో ఎప్పుడు ఓ ప్రమాదం సంభవిస్తుందో స్థానికులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వీచిన గాలులకు ఈరోడ్డులోని చెట్ల కొమ్మలు విరిగి పడగా, ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొన్ని చెట్లకు కొమ్మలు ఎండిపోగా, మరికొన్ని చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. కొమ్మలు పూర్తిగా రోడ్డుపైకి ఉండటంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. అలాగే మక్కపేట-చిల్లకల్లు రోడ్డులో పలు చెట్లు ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఎండిన కొమ్మలతోపాటు జీవం కోల్పోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన దాతల సహకారంతో పలకలు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థులు పలకలు, బలపాలు, పుస్తకాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము సమితి, దాతల సహకారంతో వాటిని కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సరస్వతి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి అందజేసిన అన్నసంతర్పణ సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు తుమ్మలపల్లి లక్ష్మీ శ్రీనివాసన్, జూలూరు శోభనాచలపతి గుప్తా, పొత్తూరు వంశీకృష్ణ, గోపు విశ్వనాథ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న గుండు దిలీప్ తదితరులు

విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మత్స్యకార రైతుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మత్స్యకార రైతులపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ఎస్. చిన దుర్గమ్మ ప్రథమ స్థానంలోను, ఎం. గీత ద్వితీయ స్థానంలోను నిలిచారు. వక్తృత్వ పోటీలలో జి. నితిన్ ప్రథమస్థానం, ఎం. మణికుమారి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జువాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. సుధాకర్, అధ్యాపకులు ఏఎల్‌కే కృపావరం, ఎస్. సునీత కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.